

సర్వే నుంచి మినహాయించాలి

మందమర్రిరూరల్: డబుల్ బెడ్రూం ఇళ్ల సర్వే నుంచి మినహాయించాలని వీఆర్‌ఏ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ సంతోష్‌ను కోరారు. వీఆర్‌ఏ జేఏసీ చైర్మన్ ఓంకార్, నాయకులు శ్రీనివాస్, గణపతి, రాజయ్య, సతీష్ పాల్గొన్నారు.

జిల్లా టీకాల అధికారిగా అనిత



మంచిర్యాలటౌన్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో జిల్లా టీకాల అధికారి డాక్టర్ రామకృష్ణకు కుమురం భీం జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా బాధ్యతలు అప్పగించడంతో జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ ప్రోగ్రాం ఆఫీసర్‌గా ఉన్న డాక్టర్ అనితను జిల్లా టీకాల అధికారిగా నియమించారు. ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్‌గా బాధ్యతలు అప్పగించగా, టీబీ జిల్లా ఇన్‌చార్జిగా డాక్టర్ ఫయాజ్‌ఖాన్‌కు బాధ్యతలు అప్పగించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0 /16.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఈశాన్యం దిశగా గాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన విప్



సీఎంకు శుభాకాంక్షలు తెలుపుతున్న సుమన్

చెన్నూర్: చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం ప్రగతిభవన్‌లో ఆయనను స్వయంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ముఖ్యమంత్రి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దివాకర్

నస్పూర్: మహాశివరాత్రి సందర్భంగా ఆలయాలు, గోదావరినది పుష్కరఘాట్ వద్ద పుణ్య స్నానాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే దివాకర్‌రావు, కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. శుక్రవారం కలెక్టర్, ఎమ్మెల్యేలు వేర్వేరుగా సీతారాంపల్లి పుష్కరఘాట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాత్కాలిక స్నాన పు గదులు, మహిళలకు వేరుగా మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునేందుకు గదులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ట్రెయినీ కలెక్టర్ గౌతమి, మున్సిపల్ కమిషనర్ రమేశ్, చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కౌన్సిలర్లు వంగ తిరుపతి, తహసీల్దార్ జ్యోతి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

'అభివృద్ధికి నోచుకోని మంచిర్యాల మున్సిపాలిటీ'



వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ అభివృద్ధికి నోచుకోవడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. శుక్రవారం ప్రజాగోస–బీజేపీ భరోసా యాత్ర మంచిర్యాలలోని హమాలీవాడ, అశోక్‌రోడ్డు, అండర్‌బ్రిడ్జి, శ్రీనివాస థియేటర్, ముఖరం చౌరస్తా, అర్చన టెక్స్ చౌరస్తా, వాటర్ ట్యాంక్ రోడ్డు గుండా కొనసాగించారు. మున్సిపల్ కమిషనర్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, నాయకులు పానుగోటి రంగారావు, నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, రజనీశ్ జైన్, పెద్దపల్లి పురుషోత్తం, పురుషోత్తం జాజు, ఆరుముళ్ల పోశం, ఆకుల అశోక్‌వర్ధన్, ఆనంద్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం రాస్తారోకో



రైతులకు నచ్చజెప్పుతున్న తహసీల్దార్, సీఐ

దండేపల్లి: గూడెం ఎత్తిపోతల పథకం తరచూ మొరాయించడంతో సాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని, పంట పొలాలు ఎండిపోతున్నాయని మండలంలోని ముత్యంపేట స్టేజీ వద్ద రైతులు రాస్తారోకో నిర్వహించారు. పంటలు ఎండిపోకుండా ప్రత్యామ్నాయంగా కడెం ప్రాజెక్టు నుంచి సాగునీరు అందించాలని అన్నారు. లక్సెట్టిపేట సీఐ కృష్ణారెడ్డి, దండేపల్లి, జన్నారం ఎస్సైలు సాంబమూర్తి, ప్రసాద్ నచ్చజెప్పినా రైతులు వినలేదు. తహసీల్దార్ హన్మంతరావు పరిస్థితిని ఫోన్ ద్వారా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌కు తెలియజేశారు. రాత్రికల్లా మరమ్మతులు పూర్తిచేయించి నీళ్లు వచ్చేలా చేస్తామని ఆయన హామీనివ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

గూడెం వద్ద పుణ్య స్నానాలకు అనుమతి లేదు

దండేపల్లి: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని గూడెం గోదావరి నది వద్ద పుణ్యస్నానాలకు భక్తులు ఎవరూ రావొద్దని ఎస్సై సాంబమూర్తి ఓ ప్రకటనలో కోరారు. నదిలో లోతు ఎక్కువగా ఉండడం, స్నానాలు చేయడం ప్రమాదకరంగా ఉన్నందున ఎవరినీ అనుమతించకూడదని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. రాయపట్నం తీరం, లక్సెట్టిపేట నదీ తీరానికి వెళ్లాలని తెలిపారు.

శంభో శంకరా..!

- శివరాత్రికి ఆలయాలు ముస్తాబు
- ప్రత్యేక పూజలు నిర్వహించనున్న భక్తులు
- నేడు మహాశివరాత్రి
- ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

మంచిర్యాలఅర్బన్: మహా శివరాత్రికి జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. భక్తులు రాత్రంతా జాగరణ చేయడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. పర్వదినం సందర్భంగా శనివారం పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరించి శైవక్షేత్రాలను దర్శించుకుంటే మంచి జరుగుతుందనేది భక్తుల నమ్మకం. మంచిర్యాలలోని విశ్వనాథ ఆలయం, గోదావరి నది తీరాన గౌతమేశ్వర ఆలయం, పాత మంచిర్యాలలోని శివరామాలయంలో ఏర్పాట్లు చేశారు. మంచిర్యాల విశ్వనాథ ఆలయం రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్‌కు అందుబాటులో ఉండడంతో ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు. శివరాత్రి సందర్భంగా ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ప్రత్యేక పూజలు చేస్తారు. శివపార్వతుల కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహిస్తారు. భక్తులు వేడుకను తిలకించేందుకు ఏర్పాట్లు చేశారు.

శివరాత్రి పుణ్యస్నానం

మహా శివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. నదీ తీరాన గౌతమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శివరాత్రి పూజ సామగ్రి కోసం భక్తులు తరలిరావడంతో మంచిర్యాల మార్కెట్‌లో సందడి నెలకొంది.



వేలాల గర్భగుడిలో శివలింగం



సాయంకాలం సూర్యనమస్కారం చేస్తున్న భక్తురాలు



మంచిర్యాల మార్కెట్‌లో కొనుగోలు సందడి



గౌతమేశ్వరాలయంలో శివలింగానికి అభిషేకం



నదీ తీరంలో సీపీ రెమా రాజేశ్వరి పరిశీలన



పూజలు చేస్తున్న భక్తులు



పండుగ సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు



గోదావరినదిలో భక్తుల పుణ్యస్నానాలు

వేలాల జాతరకు వేళాయె..!

- మల్లన్నస్వామి ఆలయం ముస్తాబు
- నాలుగు లక్షలకు పైగా తరలిరానున్న భక్తజనం
- నేడు కల్యాణ మహోత్సవం

జైపూర్: మండలంలోని వేలాల గ్రామంలో మల్లన్న స్వామి జాతరకు ఆలయం ముస్తాబైంది. మహాశివరాత్రి సందర్భంగా శనివారం నుంచి మూడు రోజుల పాటు జాతర వైభవంగా సాగుతుంది. జాతర నిర్వహణకు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఉచిత దర్శనంతోపాటు ప్రత్యేక దర్శనం రూ.50, సులభ దర్శనం రూ.100 ఏరాట్లు చేశారు. జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన ఈ జాతరకు రాష్ట్రంలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, జయశంకర్‌భూపాలపల్లి, వరంగల్, హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాలు, మహారాష్ట్రలోని సిరోంచ, గడ్చిరోలి జిల్లాల నుంచి భక్తులు తరలివస్తారు. ఈ ఏడాది సుమారు నాలుగు లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశాలు ఉండడంతో అధికారులు ఏర్పాట్లు చేశారు. గోదావరినదిలో పుణ్యస్నానాలకు పుష్కరఘాట్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. గుట్ట కింది నుంచి పై వరకు, గుడి వద్ద నుంచి గోదావరి పుష్కరఘాట్ వద్దకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. నదిలో పుణ్యస్నానాలు ఆచరించి సమీపంలోని గట్టుపై దొణలో స్వయంభూగా వెలిసిన మల్లన్న స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గట్టు మల్లన్న స్వామికి బోనాలు పోసి, పట్టు వస్త్రలతో పట్నాలు వేసి మొక్కులు చెల్లించి రాత్రంతా జాగారం చేస్తారు. సాయంత్రం 7గంటలకు ఒగ్గు పూజారుల నేతృత్వంలో పెద్దపట్నం వేసి మల్లికార్జునస్వామి, భ్రమరాంభిక కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు.



బందోబస్తుపై సూచనలు చేస్తున్న ఏసీపీ నరేందర్

భారీ బందోబస్తు

భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జైపూర్ ఏసీపీ నరేందర్ వేలాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో బందోబస్తుపై పోలీసులకు సూచనలు చేశారు. ఐదు సెక్టార్లుగా విభజించి బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఏసీపీ నరేందర్ నేతృత్వంలో 10మంది సీఐలు, 16మంది ఏఎస్సైలు, 80మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 500మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. 50 సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నారు.

100 ప్రత్యేక బస్సులు

వేలాల జాతరకు మంచిర్యాల ఆర్టీసీ డిపో, కాళేశ్వరం నుంచి 100ఆర్టీసీ బస్సులు నడిపించనున్నట్లు ఆర్టీసీ డీఎం వి.రవీంద్రనాథ్ తెలిపారు. మంచిర్యాల డిపో నుంచి 100బస్సులు కేటాయించగా, చెన్నూర్ నుంచి కాళేశ్వరానికి, అక్కడి నుంచి వేలాలకు ఆర్టీసీ బస్సులు కేటాయించినట్లు తెలిపారు. పెద్దవాళ్లకి రూ.70, చిన్నపిల్లలకు రూ.40 చార్జీ ఉంటుందన్నారు. కుందారం ఆరోగ్య కేంద్రం ద్వారా గుట్టపై, కింద ప్రత్యేకంగా వైద్య శిబిరం, 108 వాహనాలు అందుబాటులో ఉంచుతున్నట్లు జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు తెలిపారు.

బాల్య వివాహాల నియంత్రణకు చర్యలు

- హెల్ప్‌లైన్ నంబర్ 1098
- కలెక్టర్ బాదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: బాల్య వివాహాల నియంత్రణకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, మంచిర్యాల ఆర్డీవో వేణుతో కలిసి జిల్లా అధికారులు, పురోహితులు, చర్చిఫాదర్లు, ముస్లిం మతపెద్దలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టడానికి 1098 నంబరు సమాచారం అందించాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. బాల్య వివాహాల నిరోధానికి సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎస్.ఆనంద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివాహాల నియంత్రణ చట్టంపై వివరించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య, డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సీడబ్ల్యూసి చైర్మన్ వాహిద్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ సంతోష్, అధికారులు

సమీకృత కలెక్టరేట్ పనులు పరిశీలన

నస్పూర్: పట్టణంలో నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ పనులను కలెక్టర్ బాదావత్ సంతోష్ శుక్రవారం పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబర్, వివిధ శాఖల గదులు, కారిడార్, కార్యాలయం ఆవరణ నిర్మాణ పనులను పరిశీలించారు. ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమి పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం వందశాతం

మంచిర్యాలఅగ్రికల్చర్: రాష్ట్రంలో ఓటరుకార్డు, ఆధార్ అనుసంధానం ప్రక్రియ 100 శాతం పూర్తి చేసిన మొట్టమొదటి పోలింగ్ కేంద్రం కోనంపేట అధికారుల పనితీరు అభినందనీయమని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో బూత్ స్థాయి అధికారి కంకణాల సుమతిని శాలువాతో సన్మానించి రూ.10 వేల బహుమానం, ప్రశంసాపత్రం అందజేశారు. జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, బెల్లంపల్లి ఆర్డీవో శ్యామలదేవి పాల్గొన్నారు.

భక్తుల భద్రతకు జాగ్రత్తలు తీసుకోవాలి

- సీపీ రెమా రాజేశ్వరి
- స్నానఘట్టాల పరిశీలన

మంచిర్యాలక్రైం: భక్తుల భద్రతకు పోలీసులు సంబంధిత శాఖల సమన్వయంతో జాగ్రత్తలు తీసుకోవాలని రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి అన్నారు. శివరాత్రి సందర్భంగా శుక్రవారం స్థానిక గోదావరి రోడ్డు సమీపంలో భక్తుల స్నానఘట్టాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, చోరీలు, చైన్‌స్నాచింగ్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం మంచిర్యాల టౌన్, మహిళా పోలీసుస్టేషన్, ట్రాఫిక్ పోలీసుస్టేషన్ సందర్శించారు. డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.



శివలింగానికి పాలాభిషేకం చేస్తున్న సీపీ

జాతర ఏర్పాట్ల పరిశీలన

బెల్లంపల్లి: మండలంలోని కన్నాల శివారులో ఉన్న రాజరాజేశ్వరస్వామి దేవాలయాన్ని సీపీ రెమా రాజేశ్వరి శుక్రవారం సందర్శించారు. బుగ్గ జాతర ఏర్పాట్లపై డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, బెల్లంపల్లి ఏసీపీ పి.సదయ్యలతో కలిసి పరిశీలించారు. అనంతరం గర్భగుడిలో శివలింగానికి పాలాభిషేకం చేశారు. బెల్లంపల్లి రూరల్ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సైలు రాజశేఖర్, ఆంజనేయులు, ఆలయ కమిటీ చైర్మన్ మాసాడి శ్రీదేవి, సభ్యుడు వెంకటస్వామి పాల్గొన్నారు.

బాల్యం.. బలహీనం

- బెల్లంపల్లిలోని ఓ ప్రభుత్వ బాలికల వసతిగృహంలో 500 మందికి పైగా బాలికలు చదువుతున్నారు. వీరి ఆరోగ్యస్థితిని ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు పరీక్షించగా సుమారు 150మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు తేలింది.
- బెల్లంపల్లిలోని ఓ ప్రభుత్వ బాలుర వసతిగృహంలో 600 మంది విద్యార్థులను ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు పరీక్షించారు. వీరిలో 150మందికి పైగా విద్యార్థుల్లో నిర్దేశించిన ప్రమాణాల కన్నా రక్తం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు.
- బెల్లంపల్లిలోని మరో ప్రభుత్వ బాలికల విద్యాలయంలో 500 మంది విద్యార్థినులు ఉన్నారు. వీరిని ఆర్‌బీఎస్‌కే సిబ్బంది పరీక్షించగా 120 మందికి పైగా బాలికల్లో రక్తహీనత బయటపడింది. ఈ మూడే కాదు జిల్లాలోని చాలావరకు గురుకులాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.



గురుకుల విద్యార్థుల ఆరోగ్యస్థితిని పరీక్షిస్తున్న ఆర్‌బీఎస్‌కే వైద్యసిబ్బంది

- విద్యార్థుల్లో రక్తహీనత
- అందని సరైన పౌష్టికాహారం

బెల్లంపల్లి: జిల్లాలోని గురుకుల విద్యార్థిలోకం రక్తహీనతతో బాధపడుతోంది. నిర్దేశిత ప్రమాణాల కంటే తక్కువగా రక్తం ఉండడంతో నీరసం, నిస్సత్తువ కనిపిస్తోంది. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులాలు, కస్తూర్బాగాంధీ, మహాత్మా జ్యోతిబా పూలే, టీఎస్‌ఆర్‌ఎస్, మైనార్టీ గురుకుల, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో అభ్యసిస్తున్న విద్యార్థులకు సరిపడా పౌష్టికాహారం అందక రక్తహీనత బారిన పడుతున్నారు. ఎదిగే వయస్సులో పౌష్టికాహారానికి నోచుకోక బాల్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. అధిక శాతం విద్యార్థులు కనిష్టం 4, 5గ్రాముల మేర రక్తం తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఫలితంగా విద్యార్థుల్లో చురుకుదనం, ఉత్సాహం లోపిస్తోంది. శారీరకంగా, మానసికంగా కుంగిపోయి ఆటలు, చదువులో వెనుకబడుతున్నారు. రక్తహీనత కారణంగా అనారోగ్యం బారిన పడుతున్నారు. విద్యార్థుల్లో రక్తహీనతపై జిల్లా ప్రభుత్వ, విద్య యంత్రాంగం దృష్టి సారించి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి.

అందని పౌష్టికాహారం

విద్యార్థులకు నాణ్యత ప్రమాణాల ప్రకారం పౌష్టికాహారం అందడం లేదు. రక్తాన్ని వృద్ధి చేసే ఆహార పదార్థాల్లో చాలావరకు కోత విధించారు. నెయ్యి సరఫరా లేకపోగా సిక్ ఫుడ్‌ను దూరం చేశారు. పల్లిపట్టీలు, గుడ్డు, పాలు సరిపడా అందించడం లేదు. మాంసాహారాన్నీ తగ్గించారు. నెలవారీగా సగం పదార్థాలు మాత్రమే సరఫరా అవుతుండడంతో అనివార్యంగా విద్యార్థులు అర్ధాకలితో అలమటించాల్సి వస్తోంది. రోజువారీగా తినాల్సినంత తినలేకపోగా, తినేది నాణ్యత లేకపోవడంతో అనారోగ్యం పాలవుతున్నారు.

ప్రత్యేక డైట్ ఏది..!

దీర్ఘకాలం నుంచి రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు ప్రత్యేక డైట్ అందించే ఆనవాయితీ ఉండేది. హెల్దీ ట్యూస్‌డే పేరుతో ప్రతీ మంగళవారం విద్యార్థులకు విధిగా ఆపిల్ పండును సరఫరా చేయగా.. ప్రస్తుతం ఆ సదుపాయం కనుమరుగైంది. రక్తాన్ని పెంపొందించే అంజీర్ సరఫరా చేయడం లేదు. పండ్లు పత్తాలేవు. దీంతో విద్యార్థులు అనారోగ్యం, రక్తహీనతకు గురవుతున్నారు. ఒక్కో గురుకుల విద్యాలయంలో అనారోగ్యం బారిన పడుతున్న విద్యార్థుల సంఖ్య 50శాతం వరకు ఉన్నట్లు తెలుస్తోంది. బలవర్ధకమైన ఆహారం అందక బలహీనంగా మారుతున్నారు.

పెరగని మెస్‌చార్జీలు

వసతిగృహాల్లోని విద్యార్థులకు 2017–18 విద్యాసంవత్సరంలో పెంచిన మెస్‌చార్జీలనే అమలు చేస్తున్నారు. ఒక్కో నెలకు తరగతుల వారీగా మెస్ చార్జీలు అందిస్తున్నారు. 5నుంచి 7వ తరగతి విద్యార్థులకు రూ.950, 8నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.1100, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు రూ.1500 అందిస్తున్నారు. ఇప్పటివరకు అన్ని రకాల సరుకుల ధరలు రెండింతలు పెరిగాయి. కానీ అందుకు అనుగుణంగా ఏటా మెస్‌చార్జీలు పెంచడం లేదు. మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచకుండా ప్రిన్సిపాల్, వార్డెన్లపై భారం మోపుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు కాదనలేక సతమతం అవుతున్నారు.

జిల్లాలోని గురుకుల విద్యాలయాలు

ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులాలు	10
సాంఘిక సంక్షేమ వసతిగృహాలు	24
మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులాలు	8
బీసీ వసతిగృహాలు	14
గిరిజన ఆశ్రమ పాఠశాలలు	18
ప్రభుత్వ మైనార్టీ గురుకులాలు	3
కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు	18
టీఎస్‌ఆర్‌ఎస్	1

జిల్లాలో ప్రభుత్వ వసతిగృహాలు, గురుకులాల్లోని విద్యార్థుల సంఖ్య

5 నుంచి 7వ తరగతి	17,530
8నుంచి 10వ తరగతి	4,599
ఇంటర్, డిగ్రీ	8,200

పౌష్టికాహారం అందిస్తున్నాం..

సంక్షేమ, గురుకుల విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందిస్తున్నాం. ఎక్కడా నిర్లక్ష్యం చేయడం లేదు. సిక్ అయ్యే విద్యార్థులకు పాలు, పండ్లు, ఇతర పోషక విలువలు కలిగిన పదార్థాలు అందిస్తూ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. వైద్య పరీక్షలు చేయిస్తూ ఆరోగ్య స్థితిని అంచనా వేస్తున్నాం. ఇటీవల మెస్, కాస్మొటిక్ చార్జీల పెంపుదల కోసం నివేదిక పంపించాం. త్వరలో పెరిగే సూచనలు ఉన్నాయి.

– కొప్పుల స్వరూపారాణి, ఆర్సీవో, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా

ప్రతీ వంద మందిలో 30 మందికి రక్తహీనత

ప్రభుత్వ వసతిగృహాలు, గురుకులాల్లో విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నారు. దాదాపు అన్ని వసతిగృహాల్లో ఈ సమస్య ఉంది. బాలికల్లో రక్తలేమి అధికంగా ఉంటోంది. బాలురు సైతం రక్తహీనతతో బాధపడుతున్నారు. ప్రతీ వంద మందిలో 30మందికి తగ్గకుండా రక్తహీనత ఉంది. ఆరునెలలకోసారి పరీక్షలు చేస్తుండడంతో రక్తహీనత బయటపడుతోంది.

– డాక్టర్ రామకృష్ణ, రాష్ట్రీయ బాల స్వస్థియ కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే), మెడికల్ అధికారి, బెల్లంపల్లి

క్లుప్తంగా

'అలవెన్సుల లెక్క తేల్చాలి'

శ్రీరాంపూర్: బొగ్గు గని కార్మికుల 11వ వేతన ఒప్పందానికి సంబంధించిన అలవెన్సుల లెక్క తేల్చాలని బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్ కోలిండియా యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఏరియా వర్క్‌షాప్‌లో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. వేజ్‌బోర్డు సభ్యుడు లక్ష్మారెడ్డి కృషి ఫలితంగా 19 శాతం మినిమం గ్యారెంటీ బెన్‌ఫిట్‌పై ఒప్పందం జరిగిందన్నారు. ఇంకా మిగిలిన అలవెన్సులు, సామాజిక భద్రత, ప్రోత్సాహకాలు, లీవులు, సెలవులపై ఒప్పందం జరుగాల్సి ఉందన్నారు. దీన్ని నిరసిస్తూ ఈ నెల 19, 20, 21 తేదిల్లో గనులపై నిరసనలు, 21న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు కాదాసి భీమయ్య, గోపతి సందీప్, మంద సత్తయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఏసీసీ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామకృష్ణాపూర్‌లోని రాంనగర్‌కు చెందిన తొగరు రవి (45) మృతి చెందినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. జైపూర్ పవర్ ప్లాంటులో కాంట్రాక్టు లేబర్‌గా పనిచేస్తున్న రవి శుక్రవారం బైక్‌పై మంచిర్యాలకు వచ్చి వెళ్తుండగా ఏసీసీ సమీపంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఐచర్ వ్యాన్ ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య సరోజన, కుమారుడు, కూతురు ఉన్నారు. వ్యాన్ డ్రైవర్ అంజయ్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రూ.లక్ష జరిమానా చెల్లింపు

దండేపల్లి: మండలంలోని తానిమడుగు గ్రామానికి చెందిన భూక్య రాంచందర్ బైండోవర్ ఉల్లంఘించినందుకుగానూ ఇటీవల దండేపల్లి తహసీల్దార్ హన్మంతరావు రూ.లక్ష జరిమానా విధించినట్లు లక్సెట్టిపేట ఎక్సైజ్ సీఐ బాబా, ఎస్సై రాబర్ట్ తెలిపారు. జరిమానా మొత్తం సదరు వ్యక్తి శుక్రవారం చెల్లించినట్లు వారు పేర్కొన్నారు.

పురంలో నీటి కష్టాలు!

జిల్లాలో వేసవికి ముందే మున్సిపాలిటీల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతుండగా, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో తాగునీటి నిర్వహణ అస్తవ్యస్తంగానే ఉంది. రోజువిడిచి రోజు నీటిని సరఫరా చేస్తున్నారు. ఇక మున్సిపాలిటీల్లోని శివారు కాలనీల పరిస్థితి దారుణంగా ఉంది. ఆయా కాలనీలకు ట్యాంకర్లే దిక్కయ్యాయి. ట్యాంకర్ వచ్చిన రోజే నీళ్లు పట్టుకోవాల్సిన పరిస్థితి. ట్యాంకర్ రాకుంటే దూర ప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సిందే. జిల్లాలోని ఆయా మున్సిపాలిటీల్లో శుక్రవారం 'సాక్షి' విజిట్ చేయగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

- మున్సిపాలిటీల్లో వేసవికి ముందే సమస్య
- రోజు విడిచి రోజు నీటి సరఫరా
- శివారు కాలనీలకు ట్యాంకర్లే దిక్కు

సాక్షి విజిట్



ఏసీసీ ప్రాంతంలో ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మంచిర్యాలటౌన్: తలాపునే గోదావరి ఉన్నా.. ఎల్లంపల్లి ప్రాజెక్టులో నిండా నీరున్నా.. పక్కనే ఉన్న మంచిర్యాల మున్సిపాలిటీ ప్రజలకు మాత్రం తాగునీటి గోస తప్పడం లేదు. ఇటీవలి వరకు మూడు నుంచి ఐదు రోజుకోసారి తాగునీరు సరఫరా చేశారు. ప్రస్తుతం రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ పనులు జరుగుతున్నందువల్ల ప్రతీరోజు నీటి సరఫరా చేయలేకపోతున్నామని అధికారులు పేర్కొంటున్నా రెండున్నరేళ్లుగా ఇదే పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు. వచ్చిన నీరైనా స్వచ్ఛతగా లేకపోవడంతో మినరల్ వాటర్ కొనుగోలు చేస్తున్నామని వారు పేర్కొన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీ కార్యాలయంలో సైతం మున్సిపల్ నుంచి సరఫరా చేసే తాగునీటిని వినియోగించకుండా వాటర్ ప్లాంట్ల నుంచి తెప్పించుకుంటున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జిల్లా కేంద్రంలో గతంలో పది వరకు ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్ల సంఖ్య ప్రస్తుతం 20కి చేరుకుంది.

శివారు కాలనీలకు అందని తాగునీరు

మంచిర్యాల మున్సిపాలిటీలో 25 వేల వరకు నివాసాలు ఉండగా 14,742 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ప్రతీరోజు 14.85 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేయాల్సి ఉంది. హాజీపూర్ మండలం ముల్కల్ల వద్ద గోదావరి నదిపైన పంప్‌హౌజ్ ఏర్పాటు చేసి అక్కడి నుంచే తాగునీటిని అందించాల్సి ఉంది. కానీ ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు ఇంటెక్‌వెల్‌ను ఏర్పాటు చేసి నీటిని శుద్ధి చేసి అందిస్తున్నారు. మిషన్ భగీరథ పనులు పూర్తి కాకపోవడంతో మంచిర్యాలకు పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో మున్సిపల్ వాటర్ ట్యాంకుల ద్వారా తిలక్‌నగర్, రాజీవ్‌నగర్, గోపాల్‌వాడ, మజీద్‌వాడ, రంగంపేట్, ఆండాళమ్మకాలనీ, ఏసీసీ, వడ్డెర కాలనీ, తదితర ప్రాంతాలకు నీటిని ద్వారా సరఫరా చేస్తున్నారు. అవికూడా సరిపడా అందించడంలేదని కాలనీవాసులు వాపోతున్నారు.

అలంకారప్రాయంగా ట్యాంకులు

నస్పూర్: పట్టణ పరిధిలోని పలు కాలనీల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. పట్టణ పరిధిలో 17,248 నల్లా కలెక్షన్లు వేసినట్లు అధికారులు తెలిపారు. సీసీసీ లోని గాంధీనగర్, విలేజ్ శ్రీరాంపూర్, ఠాగూర్ నగర్, ఏరియాల్లో తాగునీటి సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. ఇంతకు ముందు పట్టణంలోని పలు కాలనీలకు సింగరేణి సంస్థ గోదావరి నీటిని సరఫరా చేసేది. ఆయా కాలనీలకు మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతుండడంతో సింగరేణి సంస్థ గోదావరి నీటి సరఫరాను నిలిపి వేసింది. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో కాలనీ వాసులు మినరల్ వాటర్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై మిషన్ భగీరథ ఏఈ అబ్రహాంను సంప్రదించగా పట్టణంలో హైవే విస్తరణ పనుల వల్ల పలుచోట్ల పైపులైన్లు దెబ్బతినడంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు.


విలేజ్ శ్రీరాంపూర్‌లో నిరుపయోగంగా ట్యాంకు

చేతిపంపే ఆధారం

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో మిషన్ భగీరథ నీరు కొందరికే సరఫరా అవుతోంది. దీంతో ఆయా కాలనీల ప్రజలు చేతిపంపులు, బతుకమ్మ వాగు నల్లాలు, బోరు నీటిపైనే ఆధారపడి కాలం వెళ్లదీస్తున్నారు. నాయీ బ్రాహ్మణ వీధిలో ఒకవైపు పైపులైన్లు వేసిన అధికారులు ఒకవైపు మాత్రమే నల్లా కనెక్షన్లు ఇచ్చారు. దీంతో ఆ కాలనీవాసులు చేతిపంపును ఆశ్రయిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా మున్సిపాలిటీలోని నాయీ బ్రాహ్మణ వీధి, మహంకాళివాడ, శివాలయం వీధి, పద్మశాలి కాలనీ, ఎమ్మెల్యే కాలనీ, కొత్తగూడెం కాలనీలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కావడంలేదు. బతుకమ్మ వాగు నుంచి వచ్చే నీటికి గతంలోనే 710 నల్లా కనెక్షన్లు ఏర్పాటు చేశారు. అవే నీటిని ఆయా కాలనీల ప్రజలు వినియోగిస్తున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రభుత్వం పది ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించింది. 7,010 నల్లా కనెక్షన్లు ఏర్పాటు చేసింది. ఎస్‌బీఐ వద్ద గల ట్యాంక్‌తో పాటు ఎమ్మెల్యే కాలనీ, ఎంపీడీవో కార్యాలయం వెనుకాల ఉన్న ట్యాంకులకు నీటి కనెక్షన్ ఇవ్వడం మరిచారు. నల్లగొండ పోచమ్మ వాడలో బతుకమ్మ వాగు నల్లా కనెక్షన్లు సైతం లేకపోవడంతో చేతిపంపులపైనే ఆధారపడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతిపంపుల నుంచి వచ్చే నీరు ఉప్పగా ఉండడంతో మినరల్ వాటర్ కొనుగోలు చేస్తున్నామని వారు పేర్కొన్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రానున్న వేసవిని తలచుకుని ఆందోళన చెందుతున్నారు. అధికారులు దృష్టి సారించి ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు అందేలా కృషి చేయాలని కోరుతున్నారు.


చేతిపంపు వద్ద మహిళలు

పూర్తిస్థాయిలో అందని తాగునీరు

బెల్లంపల్లి: బెల్లంపల్లి పుర ప్రజలకు నీటికష్టాలు తప్పడంలేదు. మున్సిపాలిటీలో 34 వార్డుల్లో 4,560 నల్లా కనెక్షన్‌లు ఉన్నాయి. ప్రస్తుతం వీటి ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా పూర్తిస్థాయిలో అందించలేకపోతున్నారు. ప్రతీరోజు 10.6 మిలియన్ లీటర్ల నీటిని అందించాల్సి ఉన్నా మున్సిపాలిటీ పరంగా 4.4 మిలియన్ లీటర్లు, సింగరేణి తరపున 4.6 మిలియన్ లీటర్లు సరఫరా చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.


కన్నాల బస్తీలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు

భగీరథ కనెక్షన్లు ఇచ్చినా...

మిషన్ భగీరథ పథకం ద్వారా మున్సిపాలిటీలో కొత్తగా 6,000 నల్లా కనెక్షన్లు ఇచ్చినట్లు రికార్డులు చెబుతున్నాయి. అయినా పాత పైపులైన్ ద్వారానే మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తుండటం గమనార్హం. కొత్త నల్లాలకు నీటి సరఫరా జరగకపోవడతో తాగునీటికోసం ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి.

ప్రతీరోజు సరఫరా చేయాలి



పక్కనే గోదావరి ఉన్నా పట్టణ ప్రజలు తాగునీటికి మాత్రం ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మొన్నటి వరకు మూడు నాలుగు రోజులకోసారి నీటిని సరఫరా చేసినా ప్రస్తుతం రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్నారు. ఎండాకాలం వస్తున్న దృష్ట్యా ప్రతీరోజు సరిపడా తాగునీరు అందేలా చూడాలి. – ఎస్.మంజుల, గృహిణి, మంచిర్యాల

నీళ్లు రావడం లేదు



ఇంటి ముందు మిషన్ భగీరథ పైపు వేసిండ్లు. కనెక్షన్ ఇవ్వలేదు. ముందు లైన్ వాళ్లకు నీళ్లు వస్తున్నయ్. మేము చేతిపంపు వద్ద నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నాం. రోడ్డు పక్కనుంచి వేసిన పైపులు కొన్నిచోట్ల పగిలిపోయాయి. అధికారులు స్పందించి మాకు మిషన్ భగీరథ నీరు సరఫరా చేయాలి.
– జంపాల శంకరక్క, నాయీ బ్రాహ్మణవీధి, చెన్నూర్

రోజువిడిచి రోజు సరఫరా



మంచిర్యాల మున్సిపాలిటీలో మిషన్ భగీరథ పనులు జరుగుతున్న సమయంలో తాగునీటికి కొంత ఇబ్బంది ఉండేది. ప్రస్తుతం అన్నిపైపులను వేయడంతో పాటు నీటి సరఫరాను మెరుగుపరిచాం. రోజు విడిచి రోజు తాగునీటిని అందిస్తున్నాం. నీటి సరఫరా కాని కొన్ని ప్రాంతాలకు మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నాం. – మధుకర్, మంచిర్యాల మున్సిపల్ డీఈ

నెల రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం

మున్సిపాలిటీలోని కొన్ని ట్యాంకులకు కనెక్షన్లు ఇవ్వడంలో ఆలస్యం జరిగింది. ఇప్పటి వరకు 7 వేలకు పైగా నల్లా కనెక్షన్లు ఇచ్చాం. పూర్తిస్థాయిలో నీరు సరఫరా కావడంలేదు. ఎమ్మెల్యే కాలనీ, ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట, ఎంపీడీవో కాలనీలో ఉన్న ట్యాంకులకు త్వరలోనే కనెక్షన్లు ఇస్తాం. నెల రోజుల్లో వంద శాతం నీటి సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం.
– వెంకటేశ్, మిషన్ భగీరథ డీఈ, చెన్నూర్









'కార్మికుడిని విధుల్లోకి తీసుకోవాలి'

నస్పూర్: భూపాలపల్లి ఏరియా పరిధిలోని కేటీకే 8 ఇంక్లైన్‌లో జరిగిన మిస్‌ఫైర్‌లో క్రమశిక్షణ చర్యల కింద డిస్మిస్ చేసిన కార్మికుడు సాదుల ప్రకాశ్‌ని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శ్రీరాంపూర్ ఏరియా మైనింగ్ స్టాఫ్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రకాశ్‌ని అకారణంగా డిస్మిస్ చేయడమే కాకుండా మైనింగ్ సర్దార్ బత్తుల వెంకటేశ్వర్లు, ఓవర్‌మెన్ శ్రీకాంత్‌లను డీ ప్రమోట్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమన్నారు. అనంతరం జీఎం సంజీవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ల్యాగాల శ్రీనివాస్, అన్వేశ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వంగరి రాజేశ్వర్‌రావు, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డిస్మిస్ చేయడం చట్ట వ్యతిరేకం

బెల్లంపల్లి: కార్మికులను విధుల నుంచి డిస్మిస్ చేయడం చట్ట వ్యతిరేకమని జేఏసీ నాయకులు అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముందస్తుగా నోటీసులు జారీ చేయకుండా డిస్మిస్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అక్రమ డిస్మిస్‌లను వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో ఈ నెల 20 నుంచి సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పార్వతి రాజిరెడ్డి, ఎండి చాంద్‌పాషా, దేవి సత్యం, మణిరాంసింగ్, నీరటి రాజన్న, అంబాల మహేందర్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.


జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ముగిసిన దేహదారుఢ్య పరీక్షలు


ఎత్తు పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి


షార్ట్‌పుట్ వేస్తున్న అభ్యర్థి

- తుది రాత పరీక్షకు 876 మంది అర్హత

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహిస్తున్న రెండో విడత ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు శుక్రవారం ముగిశాయి. 2,696 మందికి 2,350 హాజరు కాగా 876 మంది అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణులై తుది రాత పరీక్షకు అర్హత సాధించినట్లు ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తుది రాత పరీక్షలో మంచి మార్కులు సాధించిన వారికే ఉద్యోగావకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. అదనపు ఎస్పీలు శ్రీనివాస్‌రావ్, రాములునాయక్, సమయ్‌జాన్‌రావ్, ఆర్.వెంకటేశ్వర్లు, డీఎస్పీలు నాగేందర్, ఉమేందర్, పోతారం శ్రీనివాస్, ఉమామహేశ్వర్‌రావ్, సిబ్బంది ఉన్నారు.

ఇళ్ల పట్టాలు అందజేత

బెల్లంపల్లి: తాండూర్ మండలం మాదారం 5 ఇంక్లైన్‌కు చెందిన 11 మంది లబ్ధిదారులకు శుక్రవారం బెల్లంపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 58, 59 కింద ఎంపిక చేసిన లబ్ధిదారులకు పట్టాలు అందించామన్నారు. పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ చర్యలు తీసుకుంటున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో కె.శ్యామలాదేవి, ఎంపీపీ ప్రణయ్‌కుమార్, తహసీల్దార్ కవిత, సర్పంచ్ గాజుల సునీత, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని వేంపల్లి మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం శిక్షణ కలెక్టర్ గౌతమి సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులను పలు ప్రశ్నలు అడగగా సమాధానం ఇచ్చిన తీరుపై ఆనందం వ్యక్తం చేశారు. వారికి చాక్లెట్లు, బిస్కట్లు అందించారు. అనంతరం ఎల్‌ఈడీ టీవీ, మొబైల్ ద్వారా నేర్చుకుంటున్న పాఠాల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట సర్పంచ్ వోలపు శారద, ఎంపీడీఓ అబ్దుల్‌హై, పంచాయతీ కార్యదర్శి ప్రతిభ, కారోబార్ తిరుపతి, అంగన్‌వాడీ టీచర్ అరుణకుమారి, ఆయా కవిత, తదితరులు ఉన్నారు.

రాష్ట్ర పరిశీలకుల బృందం పర్యటన

జన్నారం: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం రాష్ట్ర పరిశీలకుల బృందం పర్యటించింది. పొనకల్, బాదంపల్లిలో ప్రాథమిక పాఠశాల, బాదంపల్లి, జన్నారంలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, రేండ్లగూడ ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న తొలిమెట్టు, ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల సంసిద్ధతపై ఆరా తీశారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు, స్లిప్ టెస్టులు, పరిశీలించారు. ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు హన్మండ్లు, చారి, ఎంఈవో విజయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్, సంతోశ్, జనార్దన్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపాధి యూనిట్ల కేటాయింపు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని దివ్యాంగులకు ఆర్థిక పునరావాస పథకం కింద రూ.16.50 లక్షల విలువైన 28 యూనిట్లను కేటాయించినట్లు జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన దివ్యాంగులు ఆన్‌లైన్‌లో http://tsobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సదరం సర్టిఫికెట్‌లో 40 శాతం దివ్యాంగత్వం ఉండాలని, 21 నుంచి 55 ఏళ్లలోపు వయస్సు, వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతల వారికి రూ.2 లక్షలలోపు ఉండాలన్నారు. ధ్రువీకరణ పత్రాలు, మూడు పాస్ ఫొటోలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు టోల్‌ఫ్రీ నంబర్ 155326 నంబరులో సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


మంచిర్యాలక్రైం: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మహిళ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. పట్టణంలోని రంగంపేటకు చెందిన పొల్క పోసు (42) భర్త రాయమల్లు 20 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి సదరు మహిళ మానసిక పరిస్థితి బాగాలేకపోవడంతో కుమారుడు సురేశ్ వద్దే ఉంటోంది. అంతే కాకుండా కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ నెల 16న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళపై హత్యాయత్నం

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని కోయవాగు గ్రామానికి చెందిన దుర్గం శారదపై హత్యాయత్నం చేసిన మాల్కార్ శ్రావణ్‌పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. అంబేద్కర్ చౌరస్తాలో కిరాణాషాపు నడుపుతున్న శారదను సిగరేట్ కావాలని అడుగగా పూజ చేస్తున్నా కాసేపు ఆగాలని కోరింది. తర్వాత ఇస్తానని చెప్పినప్పటికీ మద్యం మత్తులో కిరాణాషాపులోకి వచ్చి కత్తితో దాడి చేసేందుకు యత్నించాడని బాధితురాలు పేర్కొంది. శ్రావణ్‌పై గతంలో కూడా కేసులు ఉన్నాయని ఎస్సై తెలిపారు.

అథ్లెటిక్స్ కోచ్ శిక్షణకు ఎంపిక

బెల్లంపల్లి: పట్టణంలోని కాసిపేట సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో పీఈటీగా విధులు నిర్వర్తిస్తున్న సంతోశ్ జాతీయ స్పోర్ట్ అథారిటీ అథ్లెటిక్స్ కోచ్ శిక్షణకు ఎంపికయ్యాడు. కోటపల్లి మండలం నాగంపేటకు చెందిన సల్పాల సంతోశ్ ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబర్చి బెంగళూర్‌లో నిర్వహించనున్న కోచ్ శిక్షణకు ఎంపికయ్యాడు.


ఎంపికైన సంతోశ్